క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ విజయోత్సాహం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరు సర్పంచ్‌గా ఎన్నికైన వింజుమళ్ల విమలకుమారి విజయానికి కృషి చేసిన నేతలంతా ఆదివారం విజయోత్సవ సంబరం నిర్వహించారు. సర్పంచ్ విమలకుమారిని దుశ్శాలువాలు, పూలదండలతో సత్కరించి, బొకేలతో అభినందించారు. సర్పంచ్ విమలకుమారి తన గెలుపునకు సహకరించిన మాజీ ఎంపీపీ వినకోటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు కొండేపూడి జానకిరామయ్య, కొండేపూడి నారాయణరావు, నాయకులు రొక్కాల సూర్యారావు(యేసేపు), రొక్కాల అంజనేయులు, ఎల్లే వెంకటరమణ, బత్తుల అన్నవరం, వారా నారాయడు, కత్తుల కృష్ణ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

కాజులూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎం.తులసీరామ్ తెలిపారు. ఆదివారం గొల్లపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యపానాన్ని దశలవారీగా అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం షాపులను తగ్గించి బెల్టు షాపులను నిరోధించడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంపైనా ఆంక్షలు విధించిందన్నారు. మండల గ్రామాల్లో ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే దాడులు నిర్వహించి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. నిందితులకు కోర్టు రూ.10 వేలు వరకూ జరిమానా లేదా కొన్ని సందర్భాల్లో జైలు శిక్ష విధించవచ్చన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారు శిక్షకు గురికాక తప్పదన్నారు.

లొల్లలో కంటి వైద్య శిబిరం

రాయవరం: లొల్ల గ్రామంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక విశ్వమానవతా ఆశ్రమంలో విశ్వమానవత వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో నేత్ర వైద్య నిపుణులు వి.రాజు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే యోగ గురువు నాగలక్ష్మి యోగా థెరపీ, హోమియోపతి, ఆయుర్వేద, ప్రకృతి చికిత్సల గురించి వివరించారు. అలాగే హోమియో వైద్యులు వీరాంజనేయులు, సత్యనారాయణ, సత్యవాణి హోమియో వైద్య సేవలందించారు. 90 మంది రోగులకు హోమియోపతి మందులు ఉచితంగా అందజేశారు.

తాగునీటి సరఫరాపై రాద్ధాంతం

కె.గంగవరం: తాగునీరు సక్రమంగానే అందుతున్న గోదావరి చెంతనే ఉన్న తామరపల్లి, ఊడిమూడి, సుందరపల్లి గ్రామాలకు తాగునీరు లేదంటూ ఎల్లో పత్రికల్లో ప్రచారం చేయడం లేనిపోని రాద్ధాంతమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మండలంలోని తామరపల్లి, ఊడిమూడి, సుందరపల్లి గ్రామాలకు టీడీపీ ప్రభుత్వ హయాం నుంచి తాగునీరు సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయి. నిబంధన ప్రకారం అనుమతులు లేకుండా రొయ్యల సాగు చేయడం వల్ల భూగర్భజలాలు కలుషితమై తాగునీరు పూర్తిగా పాడై సక్రమంగా తాగునీరు రావడం లేదని ఆయా గ్రామ ప్రజలు అప్పట్లో రోడ్లపై ధర్నాలు కూడా చేశారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక సమస్యను పరిష్కరించి నిబంధనల ప్రకారం ఆయా గ్రామాల్లోఉన్న వాటర్ ట్యాంకుల కెపాసిటీని బట్టి ఉదయం సాయంత్రం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీరు సరఫరా చేస్తున్నారు. రాత్రి సమయంలో త్రీఫేజ్ విద్యుత్ ఉన్నప్పుడు పైప్‌లైన్ల ద్వారా కె.గంగవరం వాటర్ ప్రాజెక్టు నుంచి ఆయా గ్రామాల్లోని ట్యాంకులకు తాగునీరు ఎక్కిస్తున్నారు. ఆ నీటిని నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం కుళాయిల ద్వారా అందిస్తున్నారు. అయితే సుందరపల్లి, ఊడిమూడి


ఊడిమూడిలో మురుగునీటి సమస్య పరిష్కారానికి ట్యాంకు శుభ్రం చేసిన సిబ్బంది

గ్రామాల్లో వాటర్ వాచ్‌మన్‌లు సక్రమంగా విధులు చేయడకపోవడంతో రెండు గ్రామాల్లో తాగునీరు సరఫరాలో జాప్యం జరుగుతుంది. దీంతో పాటు కె.గంగవరంలోని మెయిన్ పైప్‌లైన్ లీకేజీ కావడంతో వెంటనే అధికారులు లీకేజీని సరిచేసి తాగునీరు అందించారు. లీకేజీని సరిచేయడంతో పైప్‌లైన్‌లో కొంత వరకు మురుగునీరు ట్యాంకులకు ఎక్కి కుళాయిల ద్వారా ఒక్క గంట మురుగునీరు సరఫరా అయింది. వెంటనే సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకులను శుభ్రం చేసి శుద్ధి చేసిన వాటర్‌ను సరఫరా చేశారు. కానీ ఎల్లో పత్రికల్లో ప్రతి రోజు మురుగునీరు వస్తుందని


కె.గంగవరం మెయిన్ లైన్ లీకేజీని సరి చేసిన దృశ్యం

ప్రచారం చేయడం, అసలు తాగునీరు ఇవ్వడం లేదనడం అవాస్తమని ఎంపీపీ పంపన నాగమణి, తామరపల్లి సర్పంచ్ తోకల మంగ, ఊడిమూడి సొసైటీ అధ్యక్షులు సాగా వెంగళరావు చెబుతున్నారు. దీంతో పాటు ట్యాంకులకు కెపాసిటీ సరిపోవడం లేదని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రెండు గ్రామాలకు నూతన ట్యాంకుల నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేయించారని త్వరంలో పనులు ప్రారంభమవుతాయని ఎంపీపీ నాగమణి చెబుతున్నారు.

ఉప ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ హవా

పోటీ జరిగిన వార్డుల్లోను వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి విజయం

మండపేట: మండపేట నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ హవాను కొనసాగించింది. రెండేళ్ల క్రితం జరిగిన మండల, జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ప్రభంజనం సృష్టించి చరిత్ర తిరగరాయగా మూడు వార్డుల ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులే ఎన్నికయ్యారు.

మండపేట మండలం ఏడిద -1వ వార్డు సభ్యురాలు అడపా సూర్యావతి, తాపేశ్వరం పంచాయతీలోని 14వ వార్డు సభ్యుడు ఎ.వెంకటేశ్వరరావు, కపిలేశ్వరపురం మండలం టేకి పంచాయతీలోని 8వ వార్డు సభ్యుడు కుక్కల శ్రీనివాస్ అకాల మృతితో ఆయా వార్డులకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. గతంలో వీరు వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థులుగా గెలుపొందారు. ఏడిదలో సూర్యావతి కోడలు నీలజ్యోతిని వైఎస్సార్ సీపీ నాయకులు పోటీలో నిలిపారు. గ్రామ పెద్దలతో మాట్లాడి ఎన్నికను ఏకగ్రీవం చేశారు. టేకిలో కుక్కల శ్రీనివాస్ 8వ వార్డు సభ్యుడు కాగా ఆయన సతీమణి నాగమణి సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. శ్రీనివాస్ మృతితో గ్రామంలోని పార్టీ నేతలు ఆయన తనయుడు జయ కిషోర్‌ను బరిలో నిలిపారు. ఏడిద, టేకి పంచాయతీల్లో పోటీ లేకపోవడంతో రెండు చోట్ల వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది.

తాపేశ్వరంలోను వైఎస్సార్ సీపీ విజయం

తాపేశ్వరం 14వ వార్డుకు ఐదుగురు నామినేషన్లు దాఖలు చేయగా పరిశీలనలో ఒక నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఇరువురు నామినేషన్లు ఉపసంహరించుకోగా ఇరువురు పోటీలో ఉండడంతో శనివారం పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి మేడిశెట్టి వీరేంద్ర తన ప్రత్యర్థి పెంకే కనకలింగేశ్వరరావుపై 13 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఉప ఎన్నికలు జరిగిన మూడు వార్డుల్లోను వైఎస్సార్‌సీ పీ బలపర్చిన వారే గెలుపొందడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వీరేంద్రను అభినందిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్


మేడిశెట్టి వీరేంద్ర


అడపా నీలజ్యోతి


కుక్కల జయకిషోర్

వీరేంద్రకు అభినందనలు

తాపేశ్వరంలో వార్డు సభ్యుడిగా గెలుపొందిన వీరేంద్ర ఆదివారం పార్టీ నాయకులు పంపన పద్మారావు తదితరులతో కలిసి ఏడిద కొత్తూరులో జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, కేశవరంలో ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్‌ను వారి వారి నివాసాల్లో కలిశారు. ఈ సందర్భంగా వీరేంద్రను అభినందించి వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు సూచించారు.

రాజీవ్ గాంధీ సేవలు ఎనలేనివి

మండపేట: అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు ఎనలేనివని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఆదివారం మండలంలోని ఏడిదలో కామన ఘనంగా నిర్వహించారు. రాజీవ్ సెంటర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి దేశాన్ని 20వ శతాబ్దంలోకి నడిపించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. పార్టీ నాయకులు పాడిశెట్టి సత్యనారాయణ, కొడవల్ల వెంకట సుబ్బారావు, పిల్లి అప్పన్న, మగ్గం జాకబ్ రాజు, గంగ్రోతుల రామచంద్రరావు, పీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న కామన తదితరులు

మోక్ష సంస్థ సేవలు అభినందనీయం


పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న శ్రీనివాస్, సంస్థ సభ్యులు

మండపేట: పెయింటింగ్, కూలి పనులు చేసుకునే యువకులు శ్రీమోక్ష స్వచ్ఛంద సేవాసంస్థగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని పట్టణ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పంపన శ్రీనివాస్ అన్నారు. సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం పట్టణంలోని గొల్లపుంత కాలనీలోని నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తమ సంపాదనలో కొంత మొత్తాన్ని పేదల ఆకలి తీర్చేందుకు యువకులు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. సంస్థ సభ్యులు ఎగ్గాడి లోవరాజు, మందపల్లి సూరిబాబు, కర్రి వెంకటరమణ, సతీష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి అమ్మ ఫౌండేషన్ చేయూత

మండపేట: పట్టణానికి చెందిన పేద విద్యార్థినికి దాతల సహకారంతో అమ్మ ఫౌండేషన్ రూ.35,000 ఆర్థిక సాయం అందించింది. బీటెక్ ఫస్టియర్ చదువుతున్న జి.జ్యోతిఅఖిలకు ఆదివారం సంస్థ గౌరవాధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, వ్యవస్థాపకుడు యిమిడిశెట్టి నాగభూషణం ఈ మొత్తం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు తన కుమార్తె చదువుకు ఆటంకంగా ఉన్నాయని తండ్రి తమను ఆశ్రయించారని నాగభూషణం తెలిపారు. సహకరించిన గొల్లబాబు, ఐఎస్‌డీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు యినపకోళ్ల సత్యనారాయణ (ఐఎస్‌ఎన్), పసలపూడి ప్రకాష్‌గుప్త, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చంద్రు అగస్తిరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ ప్రముఖులు బొబ్బా రామకృష్ణ, పెందుర్తి ప్రదీప్‌కుమార్, ఓదూరి మహేష్, కాళ్లకూరి దుర్గాప్రసన్న, రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి సాయం అందిస్తున్న గొల్లబాబు, నాగభూషణం

చంద్రబాబు గ్యారెంటీని విశ్వసించడం లేదు

మండపేట: భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తానంటూ మాజీ సీఎం చంద్రబాబు చెబుతున్న మాటలను ప్రజలు విశ్వసించడం లేదని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో ఆదివారం పార్టీ నేతలు కుడిపూడి రాంబాబు, మేడిశెట్టి దుర్గారావు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఏడిద గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ తదితరులు మీడియాతో మాట్లాడారు. మండపేటలో చంద్రబాబు రెండు రోజుల పర్యటన చేసి రెండు రోజులు గడవకముందే జరిగిన పంచాయతీ వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు ఎన్నికవ్వడం అందుకు నిదర్శనమన్నారు. మూడు వార్డులకు ఎన్నికలు రాగా రెండు ఏకగ్రీవమైతే ఎన్నిక జరిగిన వార్డులో సైతం తమ అభ్యర్థి గెలుపొందారన్నారు. టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీ లేదని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోను మండపేటలో వైఎస్సార్ సీపీ అఖండ విజయం ఖాయమని వారు పేర్కొన్నారు.

నేడు గరుడ పంచమి పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వరాలయంలో సోమవారం గరుడ పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అర్చకుడు బాలబాలాజీ ఆధ్వర్యంలో గరుత్మంతుడి విగ్రహానికి పంచామృతాభిషేకం చేస్తారన్నారు.

పసలపూడిలో పాస్టర్ల శాంతి ర్యాలీ

రాయవరం: మండలంలోని పసలపూడి గ్రామంలో ఆదివారం పాస్టర్లు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో ఇటీవల మహిళలపై జరిగిన దారుణ ఘటనలను నిరసిస్తూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు రెవరెండ్ భూషణం, భాస్కరరావు, ఆమెన్‌రెడ్డి, దేవారెడ్డి, సమర్పణరావు, లూథర్‌పాల్, జాన్, ప్రేమ్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. మణిపూర్ ఘటనలను మానవతావాదులందరూ ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. అక్కడి అల్లర్లకు, దారుణ ఘటనలకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.



పసలపూడిలో పాస్టర్లు నిర్వహిస్తున్న శాంతి ర్యాలీ

ఘనంగా అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ కోర్కెలు నెరవేరడంతో అష్టోత్తర పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతర స్వామి వారి నిత్య కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఈనెల 26 నుంచి జరిగే పవిత్రోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ తెలిపారు.

వలంటీర్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి జిల్లా జాయింట్ కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపీడీఓ ఎస్.షెలత్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నాయిపేట-1, చోడవరం-1, తాళ్లపాలం-3, ఉట్రుమిల్లి-1, వెంకటాయపాలెం-1, యనమదల-1 మొత్తం 8 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆయా గ్రామాలకు చెందినవారై ఉండి 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 23 నుంచి 25 వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.